లాభము కన్పించును. డబ్బుకు యిబ్బంది అంతగవుండదు పుణ్యకార్యములలో ఖర్చు పెరుగును. 18, 20, 23, 27, 30 తేదులు కార్యానుకూలములు.

ధనుస్సు:—వృత్తిలో ఉత్సాహము చురుకుదనము యేర్పడును. శ్రమతగ్గును. వ్యాపారులకు అభివృద్ధికాలము గౌరవము పెరుగును. ఉద్యోగులకు అనుకూలమార్పుతో పాటు ఆదాయము పెరుగును. బంధుమిత్రుల ఆదరణ లభించును. కొత్తఆలోచన లనుకూలించును. కొందరితో విరోధమేర్పడి సర్దుబాటగును. వస్తుసేకరణ జరుగును. 16, 18, 20, 23, 26 తేదులు తగుమయినవి.

మకరం:—కొత్తప్రయత్నములలో పాల్గొనవలసి వచ్చును. నిలబడిపోయిన పనులలో మార్పు యేర్పడును. మిత్రుల, గౌరవనీయుల ఆదరణలభించును. వ్యాపారులకు అభివృద్ధికాలము. ఉద్యోగులకు స్థానముమార్పు యేర్పడును. దేవకార్యములలో పాల్గొనవలసి వచ్చును. వస్తు విక్రయమున కాలోచనకలుగును. చెల్లించవలసిన దానికి నిర్బంధమేర్పడును. ఆరోగ్యముచెడి నయమగును. మిత్రలాభము కలుగును. 17, 20, 23, 26, 28 తేదులు శ్రేష్ఠములు.

కుంభం:—ప్రయాణము తప్పనిసరియగును. ఉన్న చోటు మార ఆలోచన కలుగును. ముఖ్యకార్యములు సాధకమగును. గౌరవనీయుల స్నేహమేర్పడును. దేవకార్యములలో పాల్గొని ఖర్చు చేయవలసివచ్చును. వస్తుసేకరణ జరుగును. ఉద్యోగులకు అనుకూలమార్పు యేర్పడును. పైవారి ఆదరణ లభించును. వ్యాపారులకు అభివృద్ధికాలము. మిత్రుల ఆదరణ లభించును. విరోధులు మిత్రులగుదురు. 16, 21, 23, 27, 30 తేదులు శుభకరములు.

మీనం:—వృత్తిలో శ్రమ యెక్కువగును. వ్యాపారంలో లాభమున కవకాశమున్నను అడ్డంకులు కలుగును. శుభవార్త వినవచ్చును. చెల్లించవలసినదానికి నిర్బంధమేర్పడును. కుటుంబ నిర్వహణలో సంతుష్టి యుండజాలదు. గౌరవనీయుల స్నేహాదరణ లభించును. నూతన ప్రయత్నములపై ఆలోచన కలుగును. కుటుంబమున సంతుష్టియుండజాలదు. ప్రయాణముచేయవలసివచ్చును. వృత్తిలో సామాన్యాదాయముండును. మిత్రలాభముండును. 20, 23, 26, 28, 30 తేదులు ముఖ్యములు. ★

---

## అప్పిచ్చువాడు?

మా విపరీతరావు ఆలోచనలన్నీ, విపరీతంగా వుంటాయని, బాలకవి శ్రీ పి. వి. యస్. పాత్రోగారు ఆనామం వాడికి సార్థకంచేసారు. శ్రీ పాత్రోగారు ఒకసారి మావూరు వచ్చినప్పుడు వీడి ప్రవర్తనంతా వీక్షించి అయ్యాదుర్గారావ్ నీఆలోచనలన్నీ చాలా విపరీతంగా వుంటవయ్యా? అందుకు నేను నీకు విపరీతరావు అనే నామం సార్థకంచేస్తున్నానని అన్నారాయన. క్రితంలో మన వాడు "చిత్రగుప్త" లో మెదడుకు మేత వెయ్యండి అనే శీర్షిక చదివి, అమాయకంగా డాక్టర్‌దగ్గరకువెళ్లి, మెదడుకు కన్నంపెటితే, మేతవేస్తాననడం పాఠకులకు. కార్టుకథలో విదితమే!

మళ్లీమనవాడు యింకొక విపరీతం తీసుకవచ్చాడు. వీడికి యిరవై రూపాయలు అవుసరం వచ్చింది. ఎలారా? యీ యిరవై రూపాయలు సంపాదించడమని ఆలోచిస్తూ వాళ్లయింటిముందు అరుగుమీద కూర్చొని విపరీతరావు విపరీతంగా ఆలోచించడం మొదలుపెట్టాడు యింతలో వాడితమ్ముడు బడినుంచి సుమతిశతకం వల్లిస్తూ వస్తున్నాడు. ఒరే! ఆపుస్తకం యిలాతే అన్నాడు. అందుకొని పేజీలు తిరగవేస్తున్నాడు. హటాత్తుగా అందులోవాడికి ఒకపద్యం అగుపించింది. "అప్పిచ్చువాడు వైద్యుడు" అనేపద్యాన్ని అనేకసార్లు చదివి, దొరికాయిరా యిరవై రూపాయలని తిన్నగా ఆపుస్తకం పట్టుకొని క్రితంలో డాక్టర్‌గారి దగ్గరకు వెళ్లాడు. డాక్టరు ఒక్కొక్కరికీ ఏమికావాలి ఎలావుంది. అని అడుగుతూ, ఏవో చీటీలపై సంతకంపెట్టి యిస్తున్నారు. విపరీతం చూసి, ఆ? వాళ్లుకూడానాలాగే, అప్పుకోసం వచ్చివుంటారని ఆలోచించి డాక్టరుగారి ఎదుటకువెళ్లి నిల్చున్నాడు. ఏమయ్యా ఎందుకొచ్చావ్. ఏంకావాలి! అని డాక్టరుగారు అడిగారు. నాకు యిరవై రూపాయలు కావాలి అని అన్నాడు. అయితే నాదగ్గరకెందుకొచ్చావ్. నేను నీకు ఎప్పుడూ బాకీలేదే? అని డాక్టరుగారన్నారు. బాకీకాదండి, నాకు నిజంగా యిరవై రూపాయలు అప్పుకావాలి. కావలిస్తే రూపాయికి బేడ ॥చొ॥ వడ్డీయిస్తానని విపరీతరావు అన్నాడు. నీవడ్డీవద్దు? నీకోనమస్కారం. యిక్కడనుంచి దయచేయ్! అని డాక్టరన్నారు. దానితో విపరీతరావుకు విపరీతంగా కోపమొచ్చి అలా అయితే యీపుస్తకంలో "అప్పిచ్చువాడు వైద్యుడు" అని ఎందుకు వ్రాసేరు అని అడిగాడు. డాక్టరు అక్కడున్న మరికొంత మంది ఆపుస్తకంలో పద్యం చదివారు. అంతా ఫక్కుననవ్వి ఓయీ వెర్రివాడా! అప్పిచ్చువాడు, వైద్యుడు యిద్దరూ వేరువేరుగాని, అప్పిచ్చువాడు వైద్యుడుకాడు అని విడమరచి చెప్పే సరికి విపరీతరావు బుర్ర గోక్కుంటూ వెళ్లిపోయాడు.

"కబీర్ షా"

★